క్లుప్తంగా

లంపీస్కిన్‌తో పశువుల మృత్యువాత

ధరూరు: లంపీస్కిన్ వ్యాధితో వైద్య అందక పశువుల మృత్యువాత పడుతున్నట్లు ఉప్పేరు గ్రామస్తులు వాపోతున్నారు. నెలరోజుల వ్యవధిలోనే గ్రామానికి చెందిన చాకలి శివన్న, అంజిరెడ్డి, గోవర్ధన్‌కు చెందిన పశువులు మృతి చెందినట్లు తెలిపారు. పశువైద్యుడు లేకపోవడంతో సమస్యపై పట్టించుకునే వారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైద్యం కోసం పశువుల వైద్యుడికి ఫోన్ చేసినా స్పందించడం లేదని, పశు వైద్యం అందకనే ఈ సమస్య తలెత్తినట్లు పేర్కొన్నారు. తక్షణమే పశువైద్యుడిని నియమించాలని కోరుతున్నారు.

డ్రోన్ తగిలి ఇద్దరికి గాయాలు

మానవపాడు: పొలంలో డ్రోన్‌తో మందు పిచికారీ చేసి కిందకు దింపుతుండగా డ్రోన్ రెక్కలు తగిలి ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని చంద్రశేఖర్ నగర్ గ్రామంలో పత్తి పంటకు ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామానికి చెందిన యాజమాని అలీబాబు, డ్రోన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నాగన్న పిచికారీ చేస్తుండగా డ్రోన్ రెక్కలు గాయపడ్డారు. గాయపడిన ఇద్దరిని 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి



మల్దకల్: చెరువును తలపిస్తున్న మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ నాయకులు హలీంపాష, తిరుమల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను వారు సందర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కళాశాల ఆవరణ చెరువును తలపిస్తుందన్నారు. దీంతో విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతుందని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. కళాశాల ఆవరణలో విషపురుగులు సంచరిస్తున్నాయన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఝాన్సీరాణి, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డికు వేర్వేరుగా అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యలపై గ్రీవెన్స్

గద్వాల: జిల్లాలోని విద్యుత్తు వినియోగదారుల సమస్యలపై బుధవారం విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల రెడ్రెఫెల్ ఫోరం ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు నదీ అగ్రహారంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి వచ్చే వినియోగదారులు తప్పనిసరిగా వారి ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లు రసీదు తీసుకురావాలని సూచించారు.

అంతర్రాష్ట్ర ఖోఖో పోటీల్లో ప్రతిభ

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాలకు చెందిన విద్యార్థులు అంతర్రాష్ట్ర ఖోఖో పోటీల్లో ప్రతిభను కనబర్చినట్లు పాఠశాల డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నిర్వహించిన సీబీఎస్ఈ క్లస్టర్ ఏడవ ఖోఖో పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చి ద్వితీయ స్థానంలో గెలుపొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ తనిఖీ

గట్టు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను మంగళవారం గద్వాల సీఐ శ్రీను సందర్శించారు. భారత్‌మాల రోడ్డు నిర్మాణంలో పనిచేస్తున్న ఇద్దరు వ్యక్తులు ఇటీవల కత్తులతో పొడుచుకున్న వ్యవహారంపై కేసు నమోదు చేశారు. కేసు విచారణలో భాగంగా స్టేషన్‌లో వివరాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

గద్వాల: ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బీసీ బాలుర కాలేజీలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కృష్ణ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. స్వాతంత్య్రం రాకపూర్వమే 1936 ఆగస్టు 12న ఆవిర్భవించినట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. ఇదే స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. రఘు, అంజి, భరత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నిర్మించారు.. నిర్వహణ మరిచారు !

- అందుబాటులోకి రాని బస్టాండ్
- చౌరస్తాలోనే బస్సుల నిలుపుదల
- ప్రయాణికులకు తప్పని అవస్థలు

ధరూరు: రూ.లక్షల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన బస్టాండును అందుబాటులోకి తీసుకురావడంలో అధికార యంత్రాగం పూర్తిగా విఫలమవుతోంది. దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం మండలల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం బైపాస్ రోడ్డులో బస్టాండును నిర్మించారు. దానిని వినియోగంలోకి తేవాల్సిన అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో నిలువ నీడలేని చౌరస్తా వద్ద ప్రయాణాలు కొనసాగించాల్సిన పరిస్థితి దాపురించిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ. లక్షల ప్రజాధనం వృథా

మండల కేంద్రంలో 15 ఏళ్ల క్రితం బస్టాండును నిర్మించారు. స్థల దాతలు కీ.శే వీరప్ప, బస్వరాజులు ఇచ్చిన స్థలంలో రూ.14 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టి దానిని అందుబాటులోకి తీసుకురావడంలో ఆర్టీసీ శాఖ పూర్తిగా విఫలమైంది. పదేళ్ల క్రితం ఆ శాఖ అధికారులు కొన్నాళ్ల పాటు ఆర్టీసీ కంట్రోలర్‌ను నియమించి బస్సులు నిలిచేలా చూశారు. ఆ తరువాత దాని ఊసే ఎత్తండం లేదు. గద్వాల నుంచి రాయచూర్ వరకు 50 కి.మీ పొడవునా ఎక్కడా బస్టాండ్లు లేవు. తాగునీరు కూడా దొరకని పరిస్థితి ఉంది.



ధరూరులో నిరుపయోగంగా బస్టాండ్



బస్సులు, ప్రైవేటు వాహనాలు ప్రస్తుతం ఆగుతున్న చౌరస్తా

నిత్యం రద్దీగా..

మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు నిత్యం వందలాది మంది ధరూరు మీదుగా గద్వాల, రాయచూరు వంటి ప్రాంతాలకు ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. వైఎస్సార్ చౌరస్తా వద్దనే బస్సులు, జీపులు, ఆటోలు ఆగి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నారు. బస్టాండు పక్కనే ఉన్నా అక్కడ బస్సులు ఆపడం లేదు. ప్రయాణికుల రద్దీ పెరుగుతున్నా తగు సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకోవడం లేదు. ముఖ్యంగా పాఠశాలల సమయాల్లో విద్యార్థులు ఉదయం, సాయంత్రం చౌరస్తాలో బస్సుల కోసం హోటళ్లు, దుకాణ సముదాయాల వద్ద నిరీక్షించి వెళ్లాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఈ విషయమై నియోజకవర్గ పాలకులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. బస్సులు నిలిపి బస్టాండును అభివృద్ధి చేయడంతో పాటు ప్రయాణికులకు తగు సౌకర్యాలు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ డీఎం వివరణ...

ఈ విషయమై గద్వాల ఆర్టీసీ డీఎం సునీతను సాక్షి వివరణ కోరగా... ప్రైవేటు వాహనాలన్ని చౌరస్తా వద్ద ఆగుతుండడంతో ప్రయాణికులు బస్టాండు వద్దకు రావడానికి ఆసక్తి చూపడం లేదు. ఇదిలా ఉంటే గద్వాల నుంచి రాయిచూరు వరకు మధ్యలో ఎక్కడా బస్టాండు లేకపోవడంతో ధరూరు బస్టాండు వద్ద కమర్షియల్ పర్పస్ దాబా ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాం. టెండర్లు పిలిచి స్టాళ్ల ఏర్పాటుకు కృషి చేశాం. కానీ టెండరు వేయడాలనికి వరూ ముందుకు రాలేదు. త్వరలోనే టెండర్లు పిలిచి షాప్‌ల లీజుకు ఇస్తాం. త్వరలోనే బస్సులు నిలిపేందుకు చర్యలు తీసుకుంటా.

బస్టాండులో బస్సులు ఆపాలి



బస్టాండులో సౌకర్యాలు కల్పించి బస్సులు ఆపేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎండలు, వానలకు నిల్చొని అవస్థలు పడుతున్నాం. బస్టాండును ఉపయోగంలోకి తెస్తే ఆ సమస్యలు ఉండవు. ఏళ్ల తరబడిగా ఉన్న సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి.

- వీరేష్, పాగుంట

విద్యతోనే ఉత్తమ భవిష్యత్



రిబ్బన్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు, మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డెప్ప

అయిజ: విద్యతోనే ఉత్తమ భవిష్యత్ అందుతుందని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మండల కేంద్రంలోని దేవనగర్ కాలనీ, బుడుగజంగాల కాలనీ, ఎస్సీ కాలనీల్లోని ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెప్పతో కలిసి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ నాయకుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం ఎమ్మెల్యే బీఆర్ఎస్ నాయకుడు నరసింహారెడ్డి ఇంట్లో కృష్ణాష్టమి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ క్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి పాఠశాలల ప్రారంభోత్సవానికి పిలువలేదని, ప్రోటోకాల్ పాటించలేదని జిల్లా కలెక్టర్‌కు సంబంధిత విద్య అధికారులపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు



బహిరంగ చర్చ వేదికలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, అధికారులు

మల్దకల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ నర్సింగరావు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి అధ్యక్షతన 15వ విడత సామాజిక తనిఖీ బహిరంగ చర్చ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోఉపాధి హామీ పథకంలో రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలతో పాటు తోటల పెంపకంలో అవినీతి, అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న వారి ప్లేస్‌లో మరొకరు ఉపాధి పనులు చేసినట్లు రికార్డులు సృష్టించి బిల్లులు డ్రా చేసినట్లు తనిఖీలో బయటపడ్డాయన్నారు. మండలంలో మొత్తం 25 గ్రామ పంచాయతీల్లో రూ.5కోట్ల ఖర్చుతో ఉపాధి హామీ పనులకు చేసినట్లు ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తెలిపారు. వాటిలో రూ.2 లక్షలకు పైగా అక్రమాలు జరిగినట్లు గుర్తించామన్నారు. వాటిని రికవరీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ ఏపీడీ శ్రీనివాసులు, పీఆర్ఏఈ బషీర్, ఎస్ఆర్‌పీ బద్రినాయక్, ఎంపీఓ రాజశేఖర్, ఏపీఓ సుజాత, నాగరాజు, ఇబ్రహీం, ఉమేరా, ప్రమీలా తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడితే చర్యలు



మానవపాడు: ఆడపిల్లలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీడీపీఓ సుజాత, జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి ఎత్తం శివ అన్నారు. మంగళవారం మండలంలోని జల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళ శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2012 గురించి వివరించారు. వేధింపులకు గురైతే 100, 1098కు సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరమన్నారు. సామాజిక మాధ్యమాలకు బానిసకావొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బషీర్, ఉపాధ్యాయులు చిన్నారెడ్డి, అరవింద్, విజయలక్ష్మి, రజనీకుమార్, శైలజ, సుమిత్ర, ఏరా, నాగమ్మ పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

గద్వాల: ప్రజా వ్యతిరేక విధానాలను పోరాటలతోనే నిలదీసి సాధించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగన్న, ఆశన్న, వెంకటేష్, కురుమన్న, ప్రభుదాసు, తిమ్మప్ప, ప్రవీణ్, తిమ్మన్న, రాజు, ధర్మన్న తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు నివాళి

గద్వాల: మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం 30వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రసత్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జనార్దన్, దొలు, లక్ష్మన్న, శ్రీను, కొత్తపల్లి అంజి, నర్సింహులు, భాస్కర్, హరి, చిన్న తదితరులు పాల్గొన్నారు.



మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం



మన్నాపురం పాఠశాలలో ఏజెన్సీ మహిళలతో మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రబాబు



మానవపాడు కేజీబీవీలో పరిశీలిస్తున్న ఎంఈఓ శివప్రసాద్, సక్రియనాయక్

మానవపాడు: కేజీబీవీలో మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ శివప్రసాద్, మండల ప్రత్యేక అధికారి సక్రియనాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలను వారు సందర్శించారు. వంటగదులు, వసతులు, కూరగాయాలు, నిల్వ గదిని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మన్నాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో..

ధరూరు: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాల, మండల పరిధిలోని మన్నాపురం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం వారంలో మూడు గుడ్లు కచ్చితంగా ఇవ్వాలన్నారు. అలాగే పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించడంతో పాటు మురుగు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంను ఆదేశించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం వడ్డించాలి

గట్టు: మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీఓ చెన్నయ్య వంట ఏజెన్సీలకు సూచించారు. మాచర్ల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట ఏజెన్సీకి త్వరలో గ్యాస్ సిలిండర్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో త్వరలోనే సోలార్ విద్యుత్ అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరగా ఎంపీడీఓ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం



అయిజ సింగిల్‌విండో వద్ద క్యూకట్టిన రైతులు

గట్టు: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల గోసను పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు, జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య ఆరోపించారు. మంగళవారం గట్టులోని పీఏసీఎస్ వద్ద రైతులతో కలసి యూరియా కోసం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియాను కూడా అందించలేని దుస్థితిలో ఉందని ఆరోపించారు. యూరియా కోసం రైతులు పెద్ద ఎత్తున బారులు తీరుతున్నట్లు తెలిపారు.

యూరియా కోసం బారులు

అయిజ: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద మంగళవారం రైతులు యూరియా కోసం బారులు తీరారు. యూరియా సరిపడినంత అందుబాటులో లేకపోవడంతో దుకాణాల్లో ఎక్కువ ధరలకు యూరియా విక్రయిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు.

సహజ కాన్పులను ప్రోత్సహించాలి



మందుల నిల్వలపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న సిద్ధప్ప

మానవపాడు: ఆరోగ్య కేంద్రంలో సహజ కాన్పులు ప్రోత్సహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సిద్ధప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం ఈ నెలలో రెండు కాన్పులు జరగడంపై వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించాలన్నారు. ఈడీడీ కేసులపై ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి వారిని ఆరోగ్య కేంద్రంలో సాధారణ కాన్పులు అయ్యేటట్లు చూడాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్ఓ వరలక్ష్మి, డీపీఎల్ఎం నరేంద్రబాబు, అక్కమ్మ, హెలెన్, చంద్రన్న, అబేదుల్ల, తిరుమల్‌రావు, సోని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లాకు కృషి చేద్దాం



నెట్టెంపాడులో క్షయ నిర్మూలన వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

ధరూరు: అందరి కృషితో జిల్లాను క్షయరహిత జిల్లాగా మారుద్దామని పీహెచ్‌సీ వైద్యురాలు ఆయేషాబేగం అన్నారు. మంగళవారం ధరూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గుడ్డెందొడ్డి, నెట్టెంపాడు గ్రామాల్లో ప్రత్యేక క్షయ నిర్ధారణ క్యాంప్ నిర్వహించారు. ఈ నెల 11 నుంచి 12వ తేదీ వరకు రెండు రోజుల పాటు ఆయా గ్రామాల్లో ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, ఆయాసం, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, కఫంలో రక్తం, అలసట తదితర లక్షణాలు ఉంటే అవి క్షయ అనుమానితమైనవిగా గుర్తించి వెంటనే పీహెచ్‌సీలో సంప్రదించాలన్నారు. 6 నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే జబ్బు పూర్తిగా నయమవుతుందని పేర్కొన్నారు. గుడ్డెందొడ్డిలో 85, నెట్టెంపాడులో 72 మందికి మొత్తం 157 మందికి సీవైటీబీ అండ్ ఎక్స్‌రే పరీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హీర్యానాయక్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగురవేయాలి



మల్దకల్‌లో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు



ఇటిక్యాలలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మల్దకల్: దేశంలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో హర్‌ఘర్ తిరంగా మండల కార్యశాల, తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ యావత్ ప్రపంచం ఆపరేషన్ సిందూర్ ద్వారా భారతదేశ ధైర్య సాహసాలు, శక్తి సామర్థ్యాలను చూసి నివ్వెరపోయిందన్నారు. మన త్రివిధ దళాలను ప్రశంసిస్తూ వీరుల త్యాగాలను గుర్తిస్తూ ప్లకార్డులతో ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. ఆగస్టు 15 వరకు నిర్వహించే ఈ కార్యక్రమంను అందరూ భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలన్నారు. 12 నుంచి 14 వరకు స్వాతంత్య్ర పోరాట స్మారక చిహ్నాలు, ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలు, యుద్ధస్మారక చిహ్నాల చుట్టూ పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే మహనీయులకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్ ఎగ్బోటే, నల్లారెడ్డి, పాల్వాయిరాముడు, వెంకటేశ్వర్‌రెడ్డి, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఎగురవేద్దాం..

ఇటిక్యాల: ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసే అవకాశం కల్పించిన గొప్పవ్యక్తి ప్రధాని మోదీ అని బీజేపీ మండలాధ్యక్షుడు షేక్ అబ్దుల్లా అన్నారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలసి తహసీల్దార్ వీరభద్రప్పకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని బైక్‌గా ర్యాలీగా వెళ్లి అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 65 హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జగదీష్, పరుశురాం, నాగేంద్ర, మహేందర్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ దేశానికి గర్వకారణం

ఉండవెల్లి: మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని బీజేపీ మండల అధ్యక్షుడు పిడుగు వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్ రెడ్డి, మహేందర్, పృధ్వీరాజ్‌సింగ్ పాల్గొన్నారు.

జెండా ఎగురవేసే అవకాశం

గద్వాల: హర్ ఘర్ తిరంగా అంటూ ప్రధాని మోదీ దేశంలోని ప్రతి ఒక్క పౌరుడికి జాతీయ జెండా ఎగురవేసే అవకాశాన్ని కల్పించారని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీకే బంగ్లాలో హర్ ఘర్ తిరంగా పట్టణ కార్యశాల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బండల వెంకట్రాములు, దేవదాసు, రజకజయశ్రీ, చిత్తారి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వెంకటస్వామి

అయిజ: జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16న జిల్లా కేంద్రం సమీపంలోని బీరెల్లి రోడ్డు మార్గంలో ఉన్న బృందావన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఉద్యోగ కార్మికులందరూ హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత టెక్నాలజీలో నైపుణ్యం సాధించాలి



అమ్మవారి కల్యాణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల: ప్రపంచం ఆధునిక టెక్నాలజీతో ముందుకు దూసుకుపోతోందని ఆ దిశగా యువత టెక్నాలజీలో నైపుణ్యం సాధించి ఉజ్వల భవిష్యత్‌కు బాట వేసుకోవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో ఏటీసీలు తెలంగాణ యువత అత్యాధునిక నైపుణ్య శిక్షణ సంస్థ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహేష్, కృష్ణ, గంగాధర్‌గౌడ్, రామాంజనేయులు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నడిగడ్డ ఇలవేల్పు జమ్ములమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం పోస్టర్, వాట్సప్ వీడియోను ఎమ్మెలే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఆయన సతీమణి బండ్ల జ్యోతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ కుర్వ హనుమంతు, ఆలయ కమిటీ చైర్మన్ బోయ వెంకట్రాములు, ఈవో పురందర్ తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న సురేష్

ధరూరు: బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ర్యాలంపాడులో స్త్రీ‌శిశు సంక్షేమ, బాలల పరిరక్షణ కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలలపై శారీరక, మానసిక, లైంగిక వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరమన్నారు. వేధింపులపై 1098కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీతమ్మ, పంచాయతీ కార్యదర్శి విజయరామారావు, ఉమెన్ హబ్ సిబ్బంది చిట్టెమ్మ, చైల్డ్ లైన్ సిబ్బంది కళావతి. టీచర్ కృష్ణ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.